# చల్లని తల్లి

"ఇందిరాదేవి"

చిన్నతనంనుంచీ నేనూ మాబావ ఆడుకుంటూ ఉండేవాళ్లం. మాబావకి నన్ను చూస్తే ఎంతో ప్రేమ. ఏం తెచ్చుకున్నా నాకుపెట్టకుండా తినేవాడుకాడు. మేమిద్దరం ఎప్పుడు పోట్లాటలెరుగం. మాఅయ్య మాకిద్దరకు పెళ్లిచేశాడు. బ్రాహ్మల పొలం పాలికితీసుకొని మేమిద్దరము వళ్లువంచి పాటుపడుతూ, ఒకళ్లజోలి అక్కర్లేకుండా కాలక్షేపం చేసేవాళ్లం. ఇట్లావుంటూండగా కొన్నాళ్లకి మాఅయ్య మంచాన్ని పడ్డాడు. మాఅయ్యను మాయింటికే తీసుకువచ్చి ఉపచర్యలుచేస్తూ ఉండేవాళ్లం. ఒక యేడాది తీసుకొని మాఅయ్య చనిపోయినాడు. తరువాత నాలుగేళ్లు యథాప్రకారం సుఖంగా కాలగడిపాం.

నాకష్టాలకు మొదలు నాకొక మొగపిల్లవాడు పుట్టాడు. ఏడాదిపిల్లడై యుండగా నాభర్తకు దగ్గు, జ్వరం పట్టుకుంది. అదే తగ్గుతుందని అశ్రద్ధచేశాము. తరువాత ఆ జబ్బు బాగా తీవ్రమైంది. అపుడు మావూరి పూజారిఅయ్యగారు మందు యిస్తాడేమోనని ఆయనవద్దకుపోయి బ్రతిమాలుకొన్నా. కొంచెం తగ్గాక మీారేం యివ్వమంటే అది యిస్తాను. ఇప్పుడు నావద్దయేమీాలేదు. కూలికి వెళ్ళటంలేదు. మందేమైనా యివ్వండని వేడుకున్నా. ముందు పదిరూపాయిలు యిస్తేనేగాని మాట్లాడవద్దని ఆయనలేచిపోయాడు. నేను గుడ్లనీళ్లు గ్రుక్కుకుంటూ అక్కడనుంచివచ్చి, మాకులంలో కొంచెం డబ్బున్న ఓ ఆసామినద్దకుపోయి మాగుడిసె తాకట్టుపెట్టి యిరువయిరూపాయిలు తెచ్చా. పదిరూపాయిలు బాపనయ్యకిచ్చి, మందు తెచ్చా. తక్కిన పదిరూపాయిలు పెట్టి రెండు నెల్లు యింటిఖర్చుగడిపా. దైవం నాపాలిట లేనందున బావను తీసుకు వెళ్లిపోయాడు. నేను యేడుస్తూ కూర్చుంటే పిల్లవాడు బెంగ పెట్టుకుంటాడని యేడుపుదిగమ్రింగుకొని పిల్లవాణ్ణి పెద్దవాణ్ణి చెయ్యాలిగదా యనుకున్నా. బావపోయిన పదిరోజులకే అప్పిచ్చినాయన నువ్వింక తీర్చేదేమిటి యిల్లు స్వాధీనంచేయమని యింట్లోనుంచి లేవగొట్టాడు. చిన్నప్పటి స్నేహితురాలుంటే ఆమె నడిగి పంచతీసుకొని పొద్దూకులూ కూలిచేసికొని అక్కడే గంజికాచుకుని తాగేదాన్ని. ఇల్లా ఓ ఏడాదిగడిచింది. ఇల్లాకూడా నేనుండటం ఆ పరమాత్మునికి యిష్టంలేదు. నా చిన్నతండ్రికి నాలుగు రోజులు జ్వరము వచ్చిపోయినాడు తండ్రి దగ్గరకు. ఈపాపికి ప్రపంచకంలో నాదనే వస్తువు లేకుండాపోయింది. ఏడుస్తూ కూర్చునేందుకు కూడా లేదు. రెక్కలాడుతేనేగాని డొక్కలాడవు. అల్లాగే యేడుస్తూపడియుంటే ఆ యిల్లాలు రెండు పూటలు గంజిపోసింది. మా కులంలో ఒక మనిషికి సంరక్షణ చేయటానికి, మరుపూటకున్న మహారాజు లేడుగా! అల్లాగే లేచి పన్లు చేసుకుంటున్నా. ఇల్లావుంటుండగా నాకుకూడ జ్వరం ప్రారంభించింది. నా చిన్నతండ్రిని నాలుగు రోజుల్లో యెత్తుకు

పోయిన ఈ జ్వరం నెల్లాళ్లువచ్చి దానంతటదే తగ్గింది. ఈ నెల్లాళ్లూ ఒకపూట కాచుకొని, యింకోపూట కాచుకోకుండా కాలం గడిపా.

ఆరోజు, గంజి కాచుకొని తాగుదామంటే యింట్లో నూకలు అయిపోయాయి. వూళ్లోకివెళ్లి అడుక్కు తెచ్చుకుందామని బయిల్దేరా. అది వేసంకాలం. తీవ్రంగా గాడ్పులేస్తున్నాయి. ఎవరు వీధి తలుపులు తీయటంలేదు. వీధివెంట యెవ్వరు నడవటంలేదు. సంపన్నులు యింటిగుమ్మంలో వట్టివేళ్ల చాపలు కట్టించుకుని నౌకర్లచేత నీళ్లు జల్లించుకుంటూ యెండవేడిమి సహిస్తున్నారు. ప్రాణం చాలోస్తుంది. కళ్లు పచ్చబడుతున్నాయి. మెల్లిగా పాకుతూ వెళ్లి రెండు మూడు యిళ్లవద్ద అరిచా. ఎవరు వినిపించుకోలా. ఇంకో యింటిదగ్గరకు వెళ్లా. తలుపువేసుంది. అరవటానికి ఓపిక లేక, యిక కదలలేక, అల్లాగే కూర్చుండిపోయాను.

నాకు కొంచెం తెలివొచ్చేటప్పటికి ఆ యింటితల్లి గాబోలు, నాతల ఆమె తొడమీద పెట్టుకుని, చిన్నగిన్నెలో మజ్జిగా అన్నం నా గొంతుకలో వేస్తోంది. నాకు విభ్రాంతిగావుంది. "ఇదేమిటమ్మా నేను మాలదానను నన్ను ముట్టుకున్నారు" అన్నా. "నాకు తెలుసులేవే! చస్తోంటే చూస్తూ వూరుకోమన్నావా" అందామె. నాకు కొంచెం సత్తువవచ్చి వెడదామని లేవ బోతుంటే ఆ యింట్లోంచి ఒకాయిన ఆమెను ఏమేవ్ అంటూ వచ్చాడు.

నాదగ్గిర ఆమె కూచుని వుంది. ఇంకేముంది మండిపడి "నీకేమయినా మతిపోయిందా? నీ మొహం తగలెయ్యా. మాలదాన్ని ముట్టుకుని సంరక్షణ చేయటానికి, నీకేమి పొయ్యేకాలం వచ్చిందే! మళ్లీ యింట్లోకి ఎల్లా వచ్చి వండిపెడదామనుకున్నావు? అంతదయ కలదానవవుతే ఆకులో పడెయ్యకపోయావు?" అని వురిమాడు. ఆమె "కాదండీ, వీధిలోకి బండొచ్చిన చప్పుడవుతే, ఎవరు వచ్చారోనని వాకిట్లోకివస్తే ఇది గుమ్మంలోపడివుంది. ఎన్ని పిలిచినా పలకలా. చచ్చిపోయిందనుకున్నాను యీగాడ్పుకి. అల్లాంటప్పుడు యెల్లా వూరుకోను చెప్పండి" అందా అమ్మ. "ఓసి నీ సముజాయిషీ మండ! అంతగా అవుతే వెంకిచేత పోయించరాదూ." అంటూ ఆదే విని అడ్డమయిన మాటలూ అనుచు నాకేసి కోపంగాచూచి ఆయన లోపలికి పోయాడు. ఆమె నన్ను వెనక్కి పిలిచి "ఆమ్మా, నీవు చాల నీరసంగాఉన్నావు. కూలి చేసుకోలేవు. ఎక్కడవుంటున్నావు" అంది. ఆమెకు నా సంగతి టూకీగా చెప్పి, ఆమెవద్ద సెలవుతీసుకుని నేను వచ్చేశా.

మర్నాడు ప్రొద్దున్న నా పంచవద్దకి పాలేరువాడొకడువచ్చి ఆ మహాతల్లి నీకిచ్చి రమ్మన్నారని కొన్ని వూరగాయలు నాలుగుకుంచాల బియ్యం యిచ్చి వెళ్లిపోయాడు. నాకు బలం వచ్చేదాకా ఆ లక్ష్మిదేవి పంపినవి సరిపోయాయి. ఇప్పుడు మామూలుగా కూలి చేసుకుంటున్నా.

ఉంటా రిటువంటి చల్లనితల్లు లక్కడక్కడ!

666